RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | మంగళవారం 16-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 259 | పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




## ఢిల్లీని కమ్మేసిన చీకట్లు..

- మధ్యాహ్నమే అర్ధరాత్రిని తలపించిన ఇసుక తుఫాన్!
- ఢిల్లీ - ఎన్‌సీఆర్‌లో ప్రకృతి విలయం..
- 92 కి.మీ వేగంతో ఇసుక తుఫాన్..
- 'రెడ్ అలర్ట్' జారీ చేసిన ఐఎండీ



2లో



## ఎట్టకేలకు డీల్ ఓకే

- పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు
- శాంతి ఒప్పందానికి అమెరికా, ఇరాన్ ఓకే
- 19వ తేదీన ఒప్పందంపై సంతకాలు
- తర్వాత వెనువెంటనే తెరుచుకోనున్న హోర్ముజ్
- ఎలాంటి సుంకాల్లేని నౌకల స్వేచ్ఛా వాణిజ్యానికి ఇరాన్, అమెరికా సమ్మతి
- స్వాగతించిన ప్రపంచ దేశాలు

### సింగపూర్‌లో సీఎం చంద్రబాబు పెట్టుబడుల వేట..

## ప్రముఖ సంస్థలతో కీలక సమావేశాలు

- ఏపీ ప్రభుత్వంతో గూగుల్ జట్టు.. ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటుకు నిర్ణయం
- గూగుల్‌తో కలిసి పనిచేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు
- ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో భాగస్వామ్యానికి అంగీకారం
- లాజిస్టిక్స్ రంగంలో పెట్టుబడులపై వైసీహెచ్ గ్రూప్‌తో చర్చలు
- ఏపీలో యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సీఎం ప్రతిపాదన



2లో



### మెట్రో విస్తరణను

## కిషన్‌రెడ్డే అడ్డుకుంటున్నారు

- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపణ
- ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రూ.13,600 కోట్ల రుణం రాకుండా చేశారు
- రెండోదశ ప్రాజెక్టుకు 50 శాతం నిధులు ఇవ్వకుంటే కేంద్రం ఎన్‌ఓసీ ఇవ్వాలని డిమాండ్
- ప్రధాని మోదీ రాజీనామా చేస్తే తానూ రాజీనామా చేస్తానని స్పష్టీకరణ

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు తొలి దశ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా, రా ష్ట్రంలో మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టు చేపట్టకుండా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కుట్రపూరితంగా అడ్డుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'ఒప్పందం ప్రకారం తొలి దశ ప్రాజెక్టు స్వాధీనానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) నుంచి అవసరమైన రుణం విడుదలకు జూన్ 15 చివరి రోజు. బ్యాంకులు సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి. ఈ రోజు కిషన్‌రెడ్డి రుణం విడుదల చేయిస్తడా? చేయించడా చివరకు రిజర్వ్ బ్యాంకు నుంచీ గ్యారెంటీ తెచ్చి ఇచ్చాం. ఇక ఫిట్టింగ్ పెట్టడానికి ఏం లేదు. రుణం ఆపడానికి కారణం ఏమిటో చెప్పండి. రుణం విడుదల చేయించడానికి మీరు మాట్లాడతరా? మాట్లాడరా రెండో విడత మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టుకు 50 శాతం నిధుల వాటాతో భాగస్వామ్యానికి కేంద్రం ముందుకు వస్తద రాదా ముందుకు రాకపోతే రాష్ట్రమే పూర్తి వ్యయంతో కట్టుకోవడానికి కేంద్రం ఎన్‌ఓసీ ఇవ్వాలి. ఉత్తరప్రదేశ్, అహ్మదాబాద్, వైజాగ్‌కు కూడా మెట్రో ఇచ్చారు. విశ్వనగరం హైదరాబాద్‌కు ఇవ్వడం లేదంటే వివక్ష ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలి..' అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు

## తెలంగాణ ఏర్పాటును నేను వ్యతిరేకించలేదు..

- కాంగ్రెస్ తీరు ఇప్పటికీ మారలేదు!
- దేశ సమగ్రత, శ్రేయస్సే జనసేన ఎజెండా
- కొన్ని పార్టీలు స్వలాభం కోసం దేశ సమగ్రతను ప్రమాదంలో పడేస్తున్నాయి
- తెలంగాణ ఏర్పాటును నేను వ్యతిరేకించలేదు
- రాష్ట్రాన్ని విభజించిన తీరుతోనే అసంతృప్తి ఉంది

ఢిల్లీ వేదికగా జనసేన పార్టీ నిర్వహించిన 'సేన ప్రస్థానం-- జాతీయ సమైక్యత కోసం' కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు తమ లక్ష్యం అధికారం లేదా పదవులు కాదని.. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. 2014లో జనసేన పార్టీని ప్రారంభించింది అధికారం





2లో

## 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా 'పెద్దన్న'ను ఒప్పించలేకపోయారు


- హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు అనుమతులు తేలేకపోవడం రేవంత్ ప్రభుత్వ వైఫల్యమేనన్న కేటీఆర్
- ఓటుకు నోటు కేసు భయంతోనే బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపణ
- మెట్రో వైఫల్యంపై సీఎం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

## ఏపీ, తెలంగాణలకు చల్లని కబురు

- హైదరాబాద్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు
- మరో 4-5 రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో పూర్తిస్థాయి విస్తరణ
- భద్రాద్రి కొత్తగూడెం, కళింగపట్నం వరకు చేరిన రుతుపవనాలు
- ముందుకు కదిలేందుకు అనుకూలంగా ఉన్న పరిస్థితులు
- భారత వాతావరణ శాఖ అధికారిక ప్రకటన



2లో



## భాగస్వామ్యం సమున్నతంగా

- భారత్, స్లోవేకియా మధ్య సత్సంబంధాలు బలోపేతం
- కుదిరిన 11 ఒప్పందాలు
- స్లోవేకియా ప్రధాని రాబర్ట్ ఫీకోతో భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# తెలంగాణ ఏర్పాటును నేను వ్యతిరేకించలేదు..



(మొదటి పేజీ తరువాయి)

కోసం కాదని, దేశానికి సేవ చేయాలనే ఆలోచనతోనే ముందుకు వచ్చామని చెప్పారు. దేశ సమగ్రతకు ముప్పు కలిగించే శక్తులను ఎప్పటికీ సహించబోమని, జాతి ప్రయోజనాల విషయంలో జనసేన ఎప్పుడూ రాజీపడదని పేర్కొన్నారు. ప్రస్తుతం పార్టీ భావజాలం బలపడుతోందని, ఇతర రాష్ట్రాల నుంచి కూడా అనేక మంది జనసేన కోసం పని చేయడానికి ముందుకు వస్తున్నారని పవన్ అన్నారు. తెలంగాణ ఏర్పాటును జనసేన ఎప్పుడూ వ్యతిరేకించలేదని, కానీ రాష్ట్ర విభజన చేసిన విధానాన్ని మాత్రమే ప్రశ్నించామని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ విభజనను నిర్వహించిన తీరు కారణంగానే ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కొన్ని సమస్యలు కొనసాగుతున్నాయన్నారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ లాభాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఢిల్లీలో ఈ కార్యక్రమం నిర్వహించడానికి ప్రత్యేక కారణం ఉందని పవన్ తెలిపారు. త్యాగాలకు ప్రతీక, పాలనకు కేంద్రబిందువు, రాజ్యాంగ విలువలకు ప్రతిబింబం ఢిల్లీ అని పేర్కొన్నారు. ఇలాంటి చారిత్రక నగరంలో దేశ సమగ్రత కోసం సమావేశం నిర్వహించడం ద్వారా జనసేన దేశభక్తికి ఎంత ప్రాధాన్యం ఇస్తుందో తెలియజేయాలనుకున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. దేశ సమైక్యతకు విఘాతం కలిగించే ఎవరినైనా జనసేన తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. 'చలి చీమలు కూడా పామును చంపేస్తాయి' అన్న సామెతను ప్రస్తావిస్తూ.. మంచి అయినా చెడు అయినా దేశ సమగ్రతకు వ్యతిరేకంగా పనిచేసే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. విభజనవాదాన్ని ప్రోత్సహించే శక్తులపై జనసేన గళం బలంగా వినిపిస్తుందని తెలిపారు. అలాగే ఢిల్లీకి తాము ఎప్పుడూ అధికారాల కోసం, పదవుల కోసం లేదా రాజకీయ ప్రయోజనాల కోసం రాలేదన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ సమగ్రత కోసం మాత్రమే ఢిల్లీ బాట పడతామని స్పష్టం చేశారు. జనసేన ఎంపీలు కూడా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపించాలని ఆయన సూచించారు. కొన్ని రాజకీయ పార్టీలు స్వలాభం కోసం దేశ సమగ్రతను ప్రమాదంలో పడేస్తున్నాయని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. హైదరాబాద్‌లో జనసేన సమావేశానికి అనుమతి ఇవ్వలేదని గుర్తు చేస్తూ.. దక్షిణాది రాష్ట్రాల్లో ఉండి ఢిల్లీపై తీవ్ర విమర్శలు చేసే నాయకులు, రాజధానికి వచ్చాక మాత్రం మౌనం వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. 'ఢిల్లీలో మెడలు వంచుతామని చెప్పేవారి నోళ్లు, ఢిల్లీకి వచ్చాక ఎందుకు పెగలడం లేదు?' అంటూ ప్రశ్నించారు. దేశ శ్రేయస్సు, జాతీయ సమగ్రత, ప్రజల సంక్షేమమే జనసేన పార్టీ ప్రధాన ఎజెండా అని పవన్ పునరుద్ఘాటించారు. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా జనసేన జాతీయ రాజకీయాల్లో తన భావజాలాన్ని మరింత బలంగా చాటిచెప్పిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## భాగస్వామ్యం సమున్నతంగా

బ్రటిస్లావా: జీ7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా యూరప్‌లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ సోమవారం స్లోవేకియాలో దేశ రాజధాని బ్రటిస్లావాలో ఆ దేశ ప్రధాని రాబర్ట్ ఫీకోతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరుదేశాల మధ్య సత్సంబంధాలను 'సమగ్ర భాగస్వామ్యం'స్థాయికి ఉన్నతీకరిస్తున్నట్లు చర్చల సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ సందర్భంగా కీలక రంగాల్లో పరస్పర సహకారం, వాణిజ్యం బలోపేతమే లక్ష్యంగా 11 కీలక ఒప్పందాలను ఇరుదేశాల అగ్రనేతలు కుదుర్చుకున్నారు. వలసలు, డిజిటల్ సాంకేతికత, రక్షణ, ఉన్నత విద్య, క్వాంటం కమ్యూనికేషన్స్ మొదలు పలు రంగాలపై చర్చలు జరిపారు. ద్వైపాక్షిక ఆర్థిక బంధం పటిష్టతే లక్ష్యంగా వీలైనంత త్వరగా ఇండియా--యూరప్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలుకు కృషిచేయాలని ఇరు నేతలు అంగీకారానికి వచ్చారు. ద్వైపాక్షిక, బహుముఖ సహకారం మరింత పెరగాలి. అందుకే బంధాన్ని సమగ్ర భాగస్వామ్యం స్థాయికి పెంచుతున్నాం. సమగ్ర భాగస్వామ్యం అనేది మన రెండు దేశాల ఉమ్మడి విశ్వాసాలు, ప్రాధమ్యాలు, ఉమ్మడి భవిష్యత్‌కు ప్రతీక. తాజా చర్చలు రెండు దేశాల బంధాన్ని మరింత సమున్నత శిఖరాలకు చేర్చాయి. అణు శక్తి, జియోథర్మల్ విద్యుత్ వంటి ఇంధన వనరుల ద్వారా ఇంధన భద్రత, సుస్థిరత, స్వావలంభన సాధిద్దాం. మన ఉమ్మడి సామర్థ్యం అమోఘం. మన సంకల్పాలు అత్యున్నతం. టోమొబైల్స్, రైల్వేలు, అధునాతన తయారీకేంద్రాలు, హరిత సాంకేతికతలకు అధిక ప్రాధాన్యతనిద్దాం. పరస్పర విశ్వాసం, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించే దిశగా కలిసి ముందడుగువేద్దాం. భారత్--ఐరోపా సమాఖ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి స్లోవేకియా సమ్మతి తెలిపింది. ఒప్పందం అమల్లోకి వస్తే ఇరుదేశాల్లోని పరిశ్రమలు, అంకుర సంస్థలు, వాణిజ్యం మునుపెన్నడూలేనంతగా ప్రయోజనం పొందటం ఖాయం"అని మీడియా సంయుక్త ప్రకటనలో ప్రధాని మోదీ అన్నారు. రక్షణరంగంలో సహకారంపై ఆసక్తి వ్యక్తీకరణ(ఎల్‌ఓఐ)పై నిర్ణయం తీసుకున్నారు. ఐక్యరాజ్యసమితిలోని భద్రతా మండలి వంటి ఉమ్మడి వేదికలపై పరస్పరం సహకరించుకోవాలని ఇరుదేశాలు అంగీకారానికొచ్చాయి. ఇరుదేశాల మధ్య కారి?మకులు, వలసదారుల తరలింపుపైనా ఒప్పందం కుదిరింది. కారి?మకుల సంక్షేమ భద్రతా ఒప్పందాన్ని రెండు దేశాలు కుదుర్చుకున్నాయి. స్లోవేకియాలో పర్యటిస్తున్న మొట్టమొదటి భారత ప్రధాని మోదీయే కావడంతో ఆదివారం రాత్రి దేశ రాజధానిలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. హోటల్ వద్ద విదేశాంగ మంత్రి జురాజ్ బ్లానర్ సాదరంగా ఆహ్వానించారు.

## ఎట్టకేలకు డీల్ ఓకే

ఇస్లామాబాద్/వాషింగ్టన్/టెల్ అవీవ్: దాదాపు 107 రోజులుగా హోర్ముజ్ జలసంధి దిగ్బంధంతో నెలకొన్న అంతర్జాతీయ చమురు సంక్షోభానికి ముగింపు పలుకుతూ, పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలను ఆర్పేస్తూ అమెరికా, ఇరాన్ చరిత్రాత్మక శాంతి ఒప్పందం కోసం సమష్టిగా ముందుకొచ్చాయి. పరస్పర షరతులకు సమ్మతి తెలుపుతూ జూన్ 19వ తేదీన శాంతి ఒప్పందంపై సంతకాలు చేయబోతున్నట్లు అటు అమెరికా, ఇటు ఇరాన్ ప్రకటించాయి. స్విట్జర్లాండ్‌లోని జెనీవా నగరంలో అమెరికా, ఇరాన్‌ల మధ్య సంతకాల కార్యక్రమాన్ని తమ ఆధ్వర్యంలో నిర్వహించబోతున్నట్లు పాకిస్తాన్ సోమవారం ప్రకటించింది. శాంతి ఒప్పందంలో ఏఏ వివరాలను పొందుపర్చబోతున్నారనే సమాచారం ఇంకా వెల్లడికాలేదు. ప్రపంచ మార్కెట్లపై యుద్ధకుంపట్లను రాజేసిన అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ అమెరికా కాలమానంప్రకారం ఆదివారం రాత్రి ఇరాన్‌తో డీల్‌పై ప్రకటన చేశారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్‌సోషల్‌లో ఒక పలు పోస్ట్‌లు పెట్టారు. "ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరింది. అందరికీ అభినందనలు. ఇకపై ఎలాంటి సుంకాల్లేకుండా హోర్ముజ్ తెరుచుకోబోతుంది. హోర్ముజ్ వద్ద అమెరికా నావికాదళ దిగ్బంధాన్ని ఎత్తేస్తున్నాం. ప్రపంచ నౌకలకు ఇదే నా పిలుపు. ఇంజిన్లు స్టార్ట్ చేయండి. చమురు సరఫరాను సముద్రమార్గంలో ఉరకలెత్తించండి. గొప్పదైన ఈ ఒప్పందంలో పశ్చిమాసియాలో శాంతి, భద్రత నెలకొంటాయి. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని గతంలో ఎంతో మంది అమెరికా అధ్యక్షులు ప్రయత్నించి విఫలమయ్యారు. తొలిసారిగా నేను శాంతి పవనాలు వీచేలా చేశా. శుక్రవారం సంతకాలు పూర్తయ్యాక హోర్ముజ్ తెరుచుకుంటుంది. సముద్ర మందుపాతరల తొలగింపు ప్రక్రియ మొదలవుతుంది. హోర్ముజ్ జలసంధికి ఇరువైపులా చమురు నౌకల రాకపోకలు ఆరంభమవుతాయి"అనిట్రంప్ తెలిపారు. "ఇరు వైపుల ప్రతినిధి బృందాలు వచ్చాక శుక్రవారం స్విట్జర్లాండ్‌లో సంతకాలు చేస్తారు. అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాక 60 రోజులపాటు సంప్రదింపుల వ్యవధి ఉంటుంది. యురేనియంను అత్యంత నాణ్యత స్థాయికి శుద్ధిచేయడం, ఇప్పటికే శుద్ధచేసిన యురేనియంను నిర్వీర్యంచేయడం, ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు, రెండో దశ ఆంక్షలు, అంతర్జాతీయ ఆంక్షల ఎత్తివేతపై చర్చలు జరుగుతాయి"అని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాసిం ఘరిబాబాడీ వెల్లడించారు. మరోవైపు ఒప్పందానికి అంగీకరించిన అమెరికాకు పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. మధ్యవర్తిత్వం వహించిన ఖతర్, తుర్కియే, సౌదీ అరేబియాలను షెహబాజ్ అభినందించారు. ఓవైపు శాంతి ఒప్పందానికి అమెరికా ముందడుగేస్తుంటే మిత్రదేశం ఇజ్రాయెల్ మాత్రం అదే యుద్ధధోరణిని మళ్లీ కనబర్చింది. "ఇరాన్ గనక మళ్లీ మాపై దాడులకు దిగితే మేం యుద్ధాన్ని కొనసాగిస్తాం. ఇప్పటిదాకా గాజా స్ట్రిప్, సిరియా, లెబనాన్‌లో మేం ఆక్రమించుకున్న సరిహద్దు ప్రదేశాలకు ఖాళీచేసేదే లేదు"అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ప్రకటించారు. శాంతి ఒప్పందంలో లెబనాన్‌నూ చేర్చాలని ఓవైపు ఇరాన్ పట్టుబడుతుంటే అదే లెబనాన్‌పై దాడులు ఆపేదిలేదని ఇజ్రాయెల్ సోమవారం సైతం స్పష్టంచేయడంతో శాంతి ఒప్పందం ఏ మేరకు సవ్యంగా అమలవుతుందనే కొత్త అనుమానాలు బయల్దేరాయి. గత రెండున్నరేళ్లలో సిరియా, లెబనాన్, గాజా స్ట్రిప్‌లో మొత్తంగా 1,000 చదరపు కిలోమీటర్ల భూభాగాలను ఇజ్రాయెల్ ఆక్రమించింది.

## మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే అడ్డుకున్నారు!

'మెట్రో తొలి దశ ప్రాజెక్టు స్వాధీనానికి అవసరమైన రుణం కోసం ఐఆర్‌ఎఫ్‌సీని ఒప్పించి అన్ని ఒప్పందాలు చేసుకున్నాం. మే 30 నాటికే అప్పు విడుదల కావాలి. జూన్ 1 నుంచి మెట్రోను పూర్తిగా ఎల్‌అండ్‌టీ నుంచి స్వాధీనం చేసుకునేలా ఒప్పందం చేసుకున్నాం. ప్రభుత్వం పెట్టుబడి వాటాగా రూ.1,400 కోట్ల మార్జిన్ మనీతో పాటు రూ.84 కోట్ల పేపర్ ఫీజు కట్టింది. ఐఆర్‌ఎఫ్‌సీ రూ.13,600 కోట్ల రుణం విడుదల చేయాల్సి ఉండగా, కరెక్టుగా ఈ సమయంలోనే (గతనెల 20న) కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్, 21న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన కిషన్‌రెడ్డి.. ఇంత సులువుగా మీరు రేవంత్‌రెడ్డికి అప్పులు ఇస్తే తెలంగాణలో బీజేపీ ఉండాలా? మూసివేయాలా? అని తిరకాసు పెట్టడంతో రుణం విడుదల చేయకుండా కేంద్రం పీటముడి వేసుకుని కూర్చుంది.' అని సీఎం ఆరోపించారు. 'రెండో దశ ప్రాజెక్టుకు కేంద్రం ఎన్‌వోసీ ఇస్తే ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి 4 శాతం వడ్డీతో మళ్లీ రూ.40 వేల కోట్ల రుణం తెచ్చుకుంటాం. మీ 50 శాతం నిధుల వాటా అవసరం లేదు..' అని రేవంత్ అన్నారు. 'ఎవరితో సంబంధం లేకుండా రేవంత్‌రెడ్డి 122 కి.మీ.ల మెట్రో కట్టుకుంటే మోదీ, కిషన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వం గురించిన చర్చ ఉండదు. అప్పుడు రాజకీయంగా నష్టం వస్తుందనే ఆలోచనతో ఎక్కడికక్కడ ఛిన్నాభిన్నం చేయడానికి బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రలు చేస్తున్నాయి. ఖట్టర్‌ను కలవడానికి వెళ్లినప్పుడు కిషన్‌రెడ్డి నన్నెందుకు తీసుకునిపోడు? వరంగల్ ఎయిర్‌పోర్టు కొలిక్కి వచ్చాక కేంద్రమంత్రి రాంమోహన్ నాయుడిని కలిసి ఏం మాట్లాడిండో ఎందుకు చెప్పడు? అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ఏం మాట్లాడిండో ఎందుకు చెప్పడు?..' అని సీఎం నిలదీశారు. 'నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2009లో మెట్రో రైలు నిర్మాణానికి టెండర్లు పిలిచారు. వైఎస్ అకాల మరణం తర్వాత నాటి సీఎం రోశయ్య రూ.15 వేల కోట్లతో 70 కి.మీ.ల కారిడార్‌తో 2017లోగా మెట్రో రైలు నిర్మాణం పూర్తి చేయడానికి ఎల్‌అండ్‌టీ సంస్థతో పీపీపీ విధానంలో ఒప్పందం చేసుకుని పనులు ప్రారంభించారు. అయితే 2014లో కేసీఆర్ సీఎం అయ్యాక చారిత్రిక కట్టడాల పేరుతో మూడు మార్గాల్లో అలైన్‌మెంట్ మార్చాలని ఎడతెగని పేచీ పెట్టడంతో పనులు ఆలస్యమై 2020కి కానీ పూర్తి కాలేదు. మూడేళ్ల జాప్యంతో వ్యయం రూ.22వేల కోట్లకు పెరిగింది. మెట్రో రైలు రెండో దశకు అనుమతి, నిధులివ్వాలని మేము అధికారంలోకి వచ్చాక ప్రధాని, కేంద్ర పట్టణాభివృద్ధి, రైల్వే, ఆర్థిక శాఖల మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశా. ఎల్‌అండ్‌టీని భాగస్వామిని చేస్తేనే అనుమతిస్తామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్ షరుతు పెడితే ఎల్‌అండ్‌టీ తిరస్కరించింది. గత ప్రభుత్వం పనులు స్తంభింపజేయడంతో రూ.7 వేల కోట్ల నష్టం వచ్చిందని పేర్కొంది. ఎల్‌అండ్‌టీతో ఒప్పందం చేసుకోవాలంటూ కేంద్రం మరోసారి మెలిక పెట్టగా, ఆ సంస్థ మళ్లీ తిరస్కరించింది. దీంతో ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో రైలు కొనుగోలే ఏకైక ప్రత్యామ్నాయం అని కేంద్రం చెప్పింది. ఇందుకు ఎల్‌అండ్‌టీని ఒప్పించి, మంత్రివర్గంలో, అసెంబ్లీలో చర్చించి ఆమోదించాం..' అని సీఎం వివరించారు. 'రెండో దశ విస్తరణకు 50శాతం నిధుల వాటా ఇవ్వడానికి కేంద్రం ఒప్పుకుందని కిషన్‌రెడ్డి చెప్పిన దాంట్లో వాస్తవముంటే కాగితం చూపించాలి. తెలంగాణ తరఫున కేంద్ర కేబినెట్ ర్యాంకు మంత్రివి నువ్వు ఒక్కడివే. మంత్రివర్గం భేటీలో పీఎం మోదీతో నువ్వే మాట్లాడాలి. కేసీఆర్‌కు భయపడి, లొంగిపోయి కిషన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. నేను నీకు అండగా నిలబడతా కేసీఆర్‌ను భయపెట్టు. కిషన్‌రెడ్డికి అంత తెలివి లేదు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నాడు.

## ఏపీ, తెలంగాణలకు చల్లని కబురు

నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా చురుగ్గా పురోగమిస్తున్నాయి. ఇవి తాజాగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రానున్న 4 నుంచి 5 రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలన్నింటికీ రుతుపవనాలు విస్తరించడానికి పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని పేర్కొంది. ఆదివారం నాటికి రుతుపవనాల ఉత్తర సరిహద్దు (నార్తర్న్ లిమిట్ ఆఫ్ మాన్‌సూన్) మహారాష్ట్రలోని హర్నై, సోలాపూర్ మీదుగా ప్రయాణిస్తూ.. తెలంగాణలోని హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నం వరకు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. అక్కడి నుంచి పారాదీప్, బరిపడ, ధన్‌బాద్ మీదుగా ముజఫర్‌పూర్ వరకు రుతుపవనాల విస్తరణ కొనసాగుతున్నట్లు స్పష్టం చేసింది. రానున్న 4-5 రోజుల్లో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయి. అలాగే ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లోకి కూడా ఇవి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తన తాజా బులెటిన్‌లో వివరించింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది.

## 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా 'పెద్దన్న'ను ఒప్పించలేకపోయారు

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు సాధించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే సీఎం నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. యూపీ, అహ్మదాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు కేంద్రం మెట్రో ప్రాజెక్టులు మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తేలేకపోయారో రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా తన 'పెద్దన్న'ను (మోదీ) ఒప్పించలేకపోవడం ఆయన చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఓటుకు నోటు కేసు ఉచ్చు బిగుస్తోందన్న భయంతోనే రేవంత్ రెడ్డి బీజేపీతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే మెట్రో విస్తరణను నిరాకరిస్తున్న ప్రధానిని, కేంద్రాన్ని విమర్శించే ధైర్యం, దమ్ము ఆయనకు లేవని అన్నారు. కేసీఆర్ సమర్థ నాయకత్వంలో ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు వస్తే, ఈ అసమర్థ పాలనలో అన్నీ నిలిచిపోయాయని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో తనను 'చెప్పుల దొంగ'లా చూస్తున్నారని రేవంత్ రెడ్డే స్వయంగా చెప్పడం ఆయన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని కేటీఆర్ అన్నారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టును సాధించడంలో విఫలమైనందుకు సీఎం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 'మినీ ఇండియా' లాంటి హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం కావడం ఖాయమని హెచ్చరించారు.

## సింగపూర్‌లో సీఎం చంద్రబాబు పెట్టుబడుల వేట.. ప్రముఖ సంస్థలతో కీలక సమావేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికతతో పాటు ఇతర కీలక రంగాల్లో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, టెక్ దిగ్గజం గూగుల్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా ఇరుపక్షాల సమన్వయంతో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండు రోజుల సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నాడు గూగుల్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ వంటి అంశాలలో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరువురు నేతలు ప్రాథమిక అంగీకారానికి వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ మరియు డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని గూగుల్ ప్రతినిధులకు సీఎం విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగానికి, 'సంజీవని' ప్రాజెక్టు అమలుకు సాంకేతిక భాగస్వామ్యం కావాలని కోరారు. అదేవిధంగా, రాష్ట్ర యువతకు ఏఐ, క్లౌడ్ టెక్నాలజీ రంగాలలో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని చంద్రబాబు ఈ సందర్భంగా ప్రతిపాదించారు. తన పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి లాజిస్టిక్స్ రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ ప్రతినిధులతో భేటీ అయి, రాష్ట్రంలో సప్లై చైన్ మరియు లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరరేఖ, పోర్టులు మరియు మెరుగైన కనెక్టివిటీ వంటి మౌలిక వసతులను వివరిస్తూ పెట్టుబడులకు ఆహ్వానించారు. మరోవైపు, యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తోనూ సమావేశమైన సీఎం, రాష్ట్రంలో 'యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటుకు చొరవ చూపారు. పట్టణ ప్రాంతాల సుస్థిర అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు.

## ఢిల్లీని కమ్మేసిన చీకట్లు.. మధ్యాహ్నమే అర్ధరాత్రిని తలపించిన ఇసుక తుఫాన్!

దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాల్లో (చీజ=) వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ఫరిదాబాద్‌లలో భారీ ఇసుక తుఫాన్ (ఐబర్ క్ౕశీతీఎ) విరుచుకుపడింది. పాలం ప్రాంతంలో గంటకు ఏకంగా 92 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈ ధూళి గాలుల కారణంగా రోడ్లపై చీకట్లు కమ్ముకున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకే అర్ధరాత్రిని తలపించేలా దట్టమైన దుమ్ము, ధూళి వ్యాపించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజిబిలిటీ (కనిపించే దూరం) పూర్తిగా పడిపోవడంతో హెడ్‌లైట్లు ఆన్ చేసుకుని వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజధానిలో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులను దృష్ట్యా భారత వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. రానున్న కొన్ని గంటల్లో వాతావరణం మరింత క్షీణించే అవకాశం ఉందని హెచ్చరించింది. పిడుగులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఎన్‌సీఆర్ పరిధిలోని కొన్ని ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్, మరికొన్ని ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలంతా ఇళ్లల్లోనే ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. హర్యానాలోని రోహ్‌తక్ మీదుగా ఏర్పడిన ఒక శక్తివంతమైన మేఘాలు ఆగ్నేయ దిశగా ఢిల్లీ వైపు వేగంగా దూసుకొస్తోందని వాతావరణ శాఖ వెల్లడించింది.



## జాతీయ సమైక్యత కోసం సేన ప్రస్థానంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

**జీలుగుమిల్లి (వజ్ర భారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ జూన్ 15:** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తలపెట్టిన జాతీయ సమైక్యత కోసం సేన ప్రస్థానం కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. దేశ రాజధాని న్యూ డిల్లీ లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, దేశ సమైక్యత, సమగ్రత మరియు జాతీయ భావజాల పరిరక్షణ లక్ష్యంగా జనసేన పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ అభివృద్ధి, సామాజిక సామరస్యం, జాతీయ ఏకత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతీయత భావనను మరింత బలోపేతం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పూర్వ విద్యార్థుల సందడి

**25 ఏళ్ల తర్వాత కలుసుకున్న సహచరులు.. గురువులకు ఘన సన్మానం**



జిన్నారం, జూన్ 15 ( నేటి ప్రస్థానం ): జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని మంగంపేట్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000--2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం సిల్వర్ జూబ్లీ రీయూనియన్‌ను ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల అనంతరం ఒకేచోట చేరిన పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆత్మీయంగా గడిపారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సహపంక్తి భోజనాలు నిర్వహించారు. తమ జీవితాలకు దిశానిర్దేశం చేసి, ఉన్నత స్థాయికి చేరేందుకు మార్గనిర్దేశం చేసిన గురువులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కలుసుకున్న సహచరులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని కుటుంబ, ఉద్యోగ, వ్యాపార విషయాలను పరస్పరం పంచుకున్నారు. పాఠశాల రోజుల అనుభవాలు, స్నేహబంధాలు, విద్యార్థి దశలోని మధుర సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, రుక్మిణి, లక్ష్మీనారాయణ, వీరేష్, వెంకటేష్, రాజు, రాజ్ భార్గవ్‌తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆప్యాయతల నడుమ ఉత్సాహంగా సాగింది.

## వర్షంలోనూ ప్రజాసేవలో సైబరాబాద్ పోలీసులు

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈరోజు కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు, సిబ్బంది రోడ్లపై ప్రత్యేకంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా లా అండ్ ఆర్డర్ సిబ్బంది ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తున్నారు. వర్షపు నీటితో నిండిన ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా సూచనలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు అన్ని పోలీసు యంత్రాంగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయి. ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## రేణిగుంటలో ఇసుక రీచ్ ప్రారంభించిన ఎమ్మెల్యే

కరీంనగర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణిగుంట గ్రామంలో గనుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇసుక రీచ్ ద్వారా స్థానిక యువతకు, గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రీచ్ నిర్వహించడం వల్ల గ్రామానికే కాకుండా రాష్ట్రానికి కూడా ఆదాయం సమకూరుతుందన్నారు .ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా కార్యకలాపాలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాభివృద్ధి, ప్రజల జీవనోపాధి మెరుగుదల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇసుక ట్రాక్టర్లు నడుపుకొని జీవనం సాగించే వారికి ఇదొక మంచి అవకాశమని, తాగి ట్రాక్టర్లు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని ఆయన సూచించారు. మితిమీరిన వేగంతో ట్రాక్టర్ నడపకూడదని, అతివేగమే ప్రమాదాలకు హేతువు అని ఆయన గుర్తు చేశారు.

# గుమ్మడిదలలో సీఎస్ఆర్ అభివృద్ధి పనులకు శ్రీకారం

**రూ.24 లక్షల వ్యయంతో బయోగ్యాస్, వర్మి కంపోస్ట్ యూనిట్లు -- అల్కాకుంట పునరుద్ధరణ పనుల ప్రారంభం**





**గుమ్మడిదల, జూన్ 15 (నేటి ప్రస్థానం):** గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయ ప్రోత్సాహానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు సమర్థవంతంగా వినియోగిస్తే గ్రామాల రూపురేఖలు మారుతాయని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ అన్నారు. న్యూల్యాండ్ ఫౌండేషన్, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దోమడుగు, బొంతపల్లి ప్రాంతాల్లో బయోగ్యాస్ యూనిట్లు, వర్మి కంపోస్ట్ యూనిట్లను ప్రారంభించడంతో పాటు అల్కాకుంట చెరువు సుందరీకరణ, పూడికతీత, భూగర్భ జలాల రీఛార్జ్ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన పర్యావరణం, సేంద్రియ వ్యవసాయం, సహజ వనరుల సంరక్షణకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. గుమ్మడిదల మండల పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో మొత్తం 14 బయోగ్యాస్ యూనిట్లను ఏర్పాటు చేయగా, ఇందుకోసం సుమారు రూ.10 లక్షల సీఎస్ఆర్ నిధులు వినియోగించారు. పశువుల వ్యర్థాలను ఇంధనంగా మార్చి కుటుంబాల అవసరాలకు ఉపయోగపడే విధంగా ఈ యూనిట్లు రైతులకు ప్రయోజనం చేకూర్చనున్నాయి. అలాగే ఎనిమిది గ్రామాల్లో 16 వర్మి కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేసి సేంద్రియ ఎరువుల తయారీకి ప్రోత్సాహం అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రూ.6 లక్షల నిధులు కేటాయించగా, రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ సాగు వైపు అడుగులు వేయడానికి ఇది దోహదపడనుంది. బొంతపల్లి వార్డులోని అల్కాకుంట చెరువు అభివృద్ధి పనులకు రూ.8 లక్షల నిధులు వెచ్చిస్తున్నారు. చెరువు పూడికతీత, సుందరీకరణ, వర్షపు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించడం, భూగర్భ జలాల మట్టాన్ని మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో ఈ పనులు చేపట్టినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, రాజారెడ్డి, చక్రపాణి, ప్రజాప్రతినిధులు జైపాల్ రెడ్డి, మహేష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. న్యూల్యాండ్ ఫౌండేషన్ తరఫున సీఎస్ఆర్ హెడ్ రవి ప్రతాప్ సింగ్, హెచ్ఆర్ హెడ్ సూర్య భగవాన్, యాదగిరి, గౌతమి తదితర ప్రతినిధులు హాజరయ్యారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయం, సహజ వనరుల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి కొత్త దిశను చూపిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.






# అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌లో ఘనంగా "కాన్ఫ్లూయెన్స్ అలుమ్ని మీట్--2026"






గుంతపల్లి, జూన్ 15: అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "కాన్ఫ్లూయెన్స్ అలుమ్ని మీట్--2026" కార్యక్రమం ఆదివారం గుంతపల్లిలోని అవంతి ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో అత్యంత వైభవంగా జరిగింది. పలువురు ప్రముఖులు, వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రస్తుత విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ వి. కామాక్షి ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయాల్లో అలుమ్ని పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా ప్రస్తుత విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ సి. కృష్ణమోహన్ మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ ఓ.బి.వి. రామనయ్య మాట్లాడుతూ, విద్య అనేది ఉద్యోగ సాధనకే కాకుండా సమాజ అభివృద్ధికి ఉపయోగపడాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన అవంతి పూర్వ విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. యోకోగావా ఇండియా లిమిటెడ్, ట్రాన్స్‌యూనియన్, ఎవోక్ టెక్నాలజీస్, హెటెరో హెల్త్‌కేర్, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, ఐటీ మరియు ఇతర కార్పొరేట్ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అలుమ్నీలు తమ విజయగాథలను వివరించి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ శ్రీ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా అవంతి సంస్థలు నాణ్యమైన విద్యను అందిస్తూ వేలాది మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చాయని తెలిపారు. అలుమ్ని నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు ఉద్యోగ, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఐ. శ్రవణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎం.వి.ఎస్.ఎస్. నందీశ్, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద కార్యక్రమంలో పాల్గొని పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. హెచ్.వి. శేష తల్ప సాయి, అవంతి సైంటిఫిక్ టెక్నలాజికల్ అండ్ రీసెర్చ్ అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ఉమాపతి రెడ్డి, అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజ్ కమల్, క్యాంపస్ ఇన్‌చార్జ్ బోస్ బాబు, పీఆర్ఓ శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలుమ్ని మీట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, పూర్వ విద్యార్థుల అనుభవాల పంచిక, అవార్డుల ప్రదానం, విద్యార్థులతో పరస్పర చర్చలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం చివర్లో అతిథులు, పూర్వ విద్యార్థులు మరియు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో అలుమ్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని యాజమాన్యం వెల్లడించింది. అవంతి కుటుంబ బంధాన్ని మరింత బలోపేతం చేసిన ఈ అలుమ్ని మీట్ విజయవంతంగా ముగిసింది.

## ప్రకృతి పరిరక్షణే లక్ష్యంగా జేఎన్‌టీయూహెచ్‌లో మొక్కలు నాటిన విద్యార్థులు

హైదరాబాద్ జేఎన్‌టీయూహెచ్: ప్రధాన మంత్రి సూచనల మేరకు ప్రకృతి పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం లక్ష్యంగా ప్రాస్త్రణ స్కాలర్ చల్ల రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎల్. సైదా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



# కాఫీకప్పులో తుఫాన్

కురుప్పలో విజయ్ అంటూ..ప్రచారం

సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో ఆర్‌జే బాలాజీ తెరకెక్కించిన చిత్రం 'కరుప్పు' తెలుగులో వీరభద్రుడుగా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వైరల్ అవుతోంది. ఇందులో విజయ్ నటించారంటూ ఓ వీడియో తెగ చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన సూపర్ హిట్ మూవీ 'లియో' చిత్రానికి సంబంధించిన రిఫరెన్స్ ఉన్నట్లు నెటిజన్లు గుర్తిస్తున్నారు. 'కరుప్పు'లో వచ్చే ఒక సన్నివేశంలో ఎవరో కాఫీ పెడుతున్నట్లు చూపిస్తారు. అయితే ఆ కాఫీ పెడుతున్న వ్యక్తి మరెవరో కాదు.. 'లియో' సినిమాలోని పార్థిబన్ (విజయ్) క్యారెక్టరేనని ఊహించుకుంటున్నారు. పైగా ఈ సన్నివేశానికి ముందు కాఫీ షాప్‌లో సర్వర్.. 'నీకు స్పెషల్ లియో కాఫీ తెస్తాను' అనడం.. అక్కడ కాఫీ పెడుతోన్న వ్యక్తిని వెనక నుంచి మాత్రమే చూపించడంతో అందరూ విజయ్ అతిథి పాత్రలో నటించారా! అని మాట్లాడుకుంటున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. కాఫీ షాప్ సన్నివేశంలో కనిపించిన శాండీ, జననీ ఇద్దరూ విజయ్ 'లియో'లోనూ కాఫీషాప్ సీన్‌లో నటించారు. ఈ సన్నివేశంపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ పెడుతున్నారు. 'ఈ సీన్ వచ్చినప్పుడు థియేటర్ అరుపులతో దద్దరిల్లింది' అని ఒకరు అనగా.. కరుప్పు' సినిమాలో ఆ కాఫీ కప్పు, ఆ మేకింగ్ స్టైల్ చూస్తుంటే కచ్చితంగా అది 'లియో' సినిమాలోని పార్థిబన్ కేఫ్ రిఫరెన్సే. ఆర్జే బాలాజీ నిజంగానే గట్టి ప్లాన్ చేశారు అని మరో నెటిజన్ కామెంట్ పెట్టారు.

# ఎల్లమ్మగా మమితాబైజు?


'బలగం' తర్వాత దర్శకుడు 'ఎల్లమ్మ' సినిమా ప్రకటించిన నాటినుంచీ ఈ సినిమాలో నటించే తారల వ్యవహారం ఓ ప్రహసనంగా మారింది. హీరోగా ముందు చాలామంది పేర్లు అనుకున్నారు. చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఖరారయ్యారు. ఆయనపై తాజాగా గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. ఇక 'ఎల్లమ్మ'లో హీరోయిన్ ఎవరు? ప్రస్తుతం ఫిల్మ్ వర్గాలను వెంటాడుతున్న ప్రశ్న ఇది. మొదట్లో సాయిపల్లవి అన్నారు.ఆ తర్వాత కీర్తి సురేశ్ పేరు వినిపించింది. ఈ వరుసలోనే చాలామంది హీరోయిన్ల పేర్లు మీడియాలో చక్కర్లు కొట్టాయి. చివరకు మలయాళ మందారం మమితాబైజు ఖరారైందంటూ ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అయితే.. ఈ పేరు బయటకు వచ్చిన నాటినుంచీ, ప్రేమలు, డ్యూడ్ లాంటి ట్రెండీ క్యారెక్టర్లు చేసే మమితాబైజు ఈ విలేజ్ డ్రామాలో ఇమడగలదా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ధనుష్ 'కర' సినిమాలో ఆమెది విలేజ్ నేపథ్య పాత్రేననీ, తను స్వతహాగా మంచినటి కాబట్టి, ఎలాంటి పాత్రనైనా అలవోకగా చేయగలదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అధికారిక ప్రకటన వచ్చేదాకా ఇవన్నీ ఊహాగానాలే అనాలి.



# స్పిరిట్‌లో సైలెంట్ వార్?

దేశవ్యాప్తంగా భారీ అంచనాల నడుమ నిర్మాణం జరుపుకుంటున్న పానిండియా చిత్రాల్లో ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం ముందు వరుసలో ఉంటుంది. ఈ ప్రెస్టేజియస్ మూవీ కోసం అభిమానులే కాదు, సగటు ప్రేక్షకులు సైతం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. పూర్తి కాప్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మునుపెన్నడూ చూడనటువంటి రూత్‌లెస్ పోలీస్ అవతారంలో ప్రభాస్ కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. పోలీస్‌స్టేషన్‌కి సంబంధించిన ఎపిసోడ్‌ని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కిస్తున్నట్లు ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ ఎపిసోడ్‌లో యాక్షన్ కంటే సైలెన్స్‌తోనే సందీప్ భయపెట్టనున్నారట. ఆద్యంతం సీరియస్ డ్రామాగా ఈ సీక్వెన్స్ సాగుతుందని వినికిడి. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఓబెరాయ్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరి మధ్య నడిచే వార్ డ్రామా ఉత్కంఠభరితంగా ఉంటుందట. త్రిప్తి డిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న గ్రాండ్‌గా విడుదల కానున్నది.





# గ్రామీణ నేపథ్యంలో హైలెస్సో

సుడిగాలి సుధీర్‌గా పేరుపొందిన సుధీర్ ఆనంద్ కథానాయకుడిగా రూపొందుతున్న ఎమోషనల్ డ్రామా 'హైలెస్సో'. ప్రసన్నకుమార్ కోట దర్శకుడు. శివ చెర్రీ, రవికిరణ్ నిర్మాతలు. ప్రముఖ నటుడు శివాజీ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తుండటం విశేషం. మంగళవారం సుధీర్ పుట్టినరోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రఫ్ లుక్‌లో, గంటలు కట్టిన ఖడ్గాన్ని చేతపట్టుకొని రక్తపు మరకలతో పవర్‌ఫుల్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న సుడిగాలి సుధీర్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బలమైన ఎమోషన్స్ కూడా ఉంటాయని, సుధీర్ ఇప్పటివరకూ చేసిన పాత్రలకు పూర్తిభిన్నమైన పాత్రను ఇందులో పోషిస్తున్నారని, ఇప్పటికే హైదరాబాద్‌లో 25రోజుల షెడ్యూల్ పూర్తయిందని, త్వరలోనే ఏలూరులో 40రోజల భారీ షెడ్యూల్ ప్రారంభం కానున్నదని మేకర్స్ తెలిపారు. నటాషా సింగ్, నక్షా సరన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నటి అక్షర గౌడ కీలక పాత్ర పోషిస్తు న్నది. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, నిర్మాణం: వజ్ర వరాహి. సినిమాస్.

# తమిళ భాష నేర్చుకుంటున్నాను

హీరో, హీరోయిన్లు వివిధ భాషల్లో సినిమాలు చేస్తుంటారు. ఆయా భాషల్లో తమ పాత్ర తాలూకు భావోద్వేగాలు అర్థం చేసుకునేందుకు, సొంతంగా డబ్బింగ్ చెప్పుకునేందుకు ఆ భాషలు నేర్చుకుంటుంటారు. తాజాగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తమిళ్ నేర్చుకుంటున్నారు. రవితేజ హీరోగా నటించిన 'మిస్టర్ బచ్చన్' (2024) సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు భాగ్యశ్రీ. అందం, అభినయంతో ఆకట్టుకున్న ఈ బ్యూటీ ఆ తర్వాత 'కింగ్‌డమ్, ఆంధ్ర కింగ్ తాలూకా' వంటి తెలుగు చిత్రాల్లో నటించారు. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి కీలక పాత్రలు పోషించిన 'కాంత' సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారామె. ప్రస్తుతం తెలుగులో అఖిల్ సరసన 'లెనిన్' మూవీలో నటిస్తున్న భాగ్యశ్రీ 'సెయాన్' అనే మరో తమిళ్ సినిమాలో అవకాశం అందుకున్న సంగతి తెలిసిందే. శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. ఈ చిత్రంలో తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ-- "ఈ చిత్రంలో నా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. నటిగా నన్ను నేను నిరూపించుకునేలా ఉంటుంది. ప్రేక్షకుల పట్ల నిజాయితీగా ఉండాలంటే నటించే చిత్రాల భాషను నేర్చుకోవాలి. తెలుగులో 'కింగ్‌డమ్' చిత్రానికి నేనే డబ్బింగ్ చె??పాను. ఇప్పుడు 'సెయాన్' కోసం తమిళ భాష నేర్చుకుంటున్నాను" అని భాగ్యశ్రీ బోర్సే పేర్కొన్నారు.



EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/